ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20.11.2024 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడలో పర్యటిస్తున్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.
2. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సర్వే ఇప్పటి వరకు 83.64 శాతం పూర్తయినట్లు ప్రభుత్వం తెలిపింది. సర్వేలో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.
3. హైదరాబాద్ శిల్పారామంలో లోక్ మంథన్ రేపు ప్రారంభమవుతుంది. ఎల్లుండి జరిగే మేథోమథన కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతారు.
4. రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు పడిపోతున్నాయి.

-----------------------------

**సీఎం-వేములవాడ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడలో పర్యటిస్తున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో అక్కడికి చేరిన ఆయన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా వేములవాడ వచ్చారు. 76 కోట్ల రూపాయల వ్యయంతో

చేపట్టే ఆలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంకుస్థాపన చేశారు. 4 వేల 696 మంది మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు భూమి పూజ చేశారు. ఇళ్ల నిర్మాణానికి 235 కోట్ల రూపాయలు వ్యయమవుతుంది. రూ. 166 కోట్లతో చేపట్టే వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణం, 45 కోట్ల రూపాయలతో మూలవాగు వంతెన నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణకు, 35 కోట్లు ఖర్చు కాగల అన్నదానం సత్రానికి శంకుస్థాపన చేశారు. సిరిసిల్లలో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, 4.80 కోట్లతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.2023 డిసెంబర్ నుంచి మరణించిన 17మంది గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియో మంజూరు లేఖలను అందజేస్తారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పీటీసీ... రాజన్న సిరిసిల్ల**

---------------------------

**కుటుంబ సర్వే**

రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇప్పటి వరకు 83.64 శాతం పూర్తయినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా గల కోటి 16 లక్షల 14వేల 349ఇళ్లలో ఇప్పటి వరకు 83 లక్షల 64 వేల 331 నివాసాలలో సర్వ పూర్తయిందని ఒకప్రకటనలో పేర్కొంది. ములుగు జిల్లాలో 99 శాతం సర్వే

పూర్తయింది. నల్లగొండ, జనగామ జిల్లాలు 95 శాతం,. 93.3 శాతంతో తరువాతి స్థానాల్లో నిలిచాయి. మిగతా జిల్లాల్లో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ప్రెస్ నోట్**

--------------------

**లోక్ మంథన్**

హైదరాబాద్ శిల్పారామంలో రేపటి నుంచి నాలుగురోజుల పాటు లోక్ మంథన్ నాలుగవ సంచికను నిర్వహిస్తారు. ప్రదర్శనలు, సాంస్కృతిక ఉత్సవాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు , ఎల్లుండి వివిధ దేశాల ప్రతినిధులతో జరిగే మేథోమథన కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15 వందలకు పైగా కళాకారులు వందకు పైగా కళను ప్రదర్శిస్తారని, 400కు పైగా అరుదైన భారతీయ సంగీత వాద్యాలతో కచేరి ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో 'మన భవిష్యత్తు, సంస్కృతి-సంప్రదాయాలు, జీవన విధానాలు తదితర 13 అంశాలపై చర్చిస్తారని విజ్ఞాన్ ప్రవాహ్ సమన్వయకర్త నందకిశోర్ చెప్పారు. లోక్ మంథన్ ను 2016, 2018, 2022లో వరుసగా భోపాల్, రాంచీ, గువాహటిలో నిర్వహించారు.

**డెస్క్**

-----------------------

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

బీఆర్ఎస్  పార్టీ అధినేత చంద్రశేఖర్ రావు మొక్కను తెలంగాణ గడ్డపై మళ్ళీ మొలకెత్త నివ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పైన ఆ పార్టీ నాయకుడు మాజి మంత్రి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభ్యంతరం వ్యక్తం చేసారు. వరంగల్ లో ఈ రోజు విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ  మాజి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు మహా వృక్షం  అని, రేవంత్  ఒక  గంజాయి మొక్క  అని విమర్శించారు.

**PTC**

--------------------

**సచివాలయం...ముఖ గుర్తింపు**

రాష్ట్ర సచివాలయంలో అన్ని కేటగిరి సిబ్బంది హజరుకు సంబంధించి  ముఖ గుర్తింపు –ఫేషియల్ రికగ్నిషన్- ప్రక్రియను  అములు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఐఏఎస్ లకు మినహా అందరికి ఈ విధానాన్ని అమలు చేస్తారు.  ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు.ఇందుకు సంబంధించి రేపు  ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తారు.  ఇప్పటి వరకు హాజరుపట్టిలో సంతకాలు చేసే విధానం కొనసాగుతోంది. హాజరు శాతాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సచివాలయంలో  నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి  అదనపు కార్యదర్శుల వరు సుమారు  4 వేల మంది ఉద్యోగులు ఉన్నారు.

**డెస్క్**

----------------------

**పార్లమెంట్ సమావేశాలు**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25న ప్రారంభమవుతాయి. ఆ ముందు రోజు అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తారు. స్వతంత్ర భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26 వ తేదీన సంవిదాన్ సందన్ సెంట్రల్ హాల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రజిజు తెలిపారు.

**డెస్క్**

----------------------------

**నిధులు-వరంగల్**

వరంగల్ నగరపాలక సంస్థలో వివిధ పథకాల అమలు కోసం 187 కోట్ల 42 లక్షల రూపాయలు విడుదల చేస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మహా వరంగల్ నగర పాలక సంస్థలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కోసం ప్రభుత్వం ఇప్పటికే 4 వేల 170 కోట్ల రూపాయలు కేటాయించింది.

**డెస్క్**

--------------------

**కొనుగోలు కేంద్రాలు-తుమ్మల**

రాష్ట్రం వరి, పత్తి కొనుగోలు కేంద్రాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని,సరకుకు కొనుగోలుకు

సంబంధించిన నగదును వెంటనే వారి ఖాతల్లో జమచేయాలని వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. 'రైతునేస్తం' కార్యక్రమం కింద ఆయన రైతువేదికతో నిన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న బోనస్ పొందిన రైతులతో ఆయన ముచ్చటించారు.

**డెస్క్**

-----------------------------

**అంతర్రాష్ట్ర బదిలీలు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీ అంశాన్ని చురకుగా పరిశీలిస్తామని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. విభజన సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన మంత్రులు, అధికారుల కమిటీల ద్వారా అంతర్రాష్ట్ర బదిలీల అంశాన్ని పరిష్కరిస్తామని ఆయన నిన్న శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపారని ఆయన గుర్తు చేశారు.

**డెస్క్**

--------------------------

**చలి తీవ్రత**

రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు మరింత పెరుగుతోంది. అనేక జిల్లాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ లో 9.5 డిగ్రీల సెల్సియస్, . అసిఫాబాద్ జిల్లాలోని సూర్పూర్(యు)లో 9.7 డిగ్రీలు, కుమురం భీం అసిఫాబాద్ లో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.కోహీర్ లో గత ఏడాది ఇదే సమయానికి రాత్రి ఉష్ణోగ్రతలు 16.9 డిగ్రీలు కాగా, తాజాగా పది డిగ్రీల తక్కువకు పడిపోయిందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ సహా అనేక జిల్లాల్లో సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఉదయం 8గంటల వరకు కూడా పొగమంచు వీడడం లేదు. అత్యవసరమైతేనే ఉదయం, సాయంత్రం ఉన్ని దుస్తులు ధరించి బయటికి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. వచ్చే మూడు రోజుల్లో చలి తీవ్రతకు సంబంధించి హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లోఅలెర్ట్ జారీ చేసింది.

**డెస్క్ /అసిఫాబాద్**

----------------------------

**ధాన్యం-జనగామ**

జనగామ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందని, కొనుగోలుకు సంబంధించ ఇప్పటి వరకు దొడ్డు రకం ధాన్యం కి 98 కోట్ల రూపాయలు, సన్నరకానికి కోటి రూపాయల వరకు చెల్లించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి చెప్పారు. అమె నిన్న జనగామ సందర్శించి ధాన్యం కొనుగోలు, సమగ్ర కుటుంబ సర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**పీటీసీ....జనగామ**

--------------------

**పొన్నం-ఈవీ**

దేశ రాజధాని ఢిల్లీలోని కాలుష్య సమస్యలు హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలో తలెత్త కూడదన్న ఉద్దేశంతోనే ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని తెచ్చినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లు తున్నప్పటికి, ఈ వాహనాలపై రెండేళ్ల వరకు టాక్స్, రిజిస్ట్రేషన్ రుసుం నూరు శాతం మినహాయింపును ఇస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాలుష్యాన్ని నివారించేందుకు 15 సంవత్సరు దాటిన మోటారు వాహనాలను స్క్రాప్ నకు పంపాలని వాహనదారులకు ఆయన సూచించారు.

**డెస్క్**

----------------------------

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంభి స్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణం లో సీపీఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా నిన్న జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే పనులపై అఖిలపక్షం నాయకులతో చర్చలు జరపకుండా నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని విమర్శించారు. మూసీ నది ఒడ్డున ఉన్న ఇళ్లకు బదులుగా వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారికి ప్రతీనెల 15 వేల రూపాయలను అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గత ప్రభుత్వం ఫార్మాసిటికి హైదరాబాద్ శివారులో 13వేల ఎకరాలను తీసుకున్నారని అక్కడ దానిని నిర్మించకుండా ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో 10వేల ఎకరాల భూములను తీసుకోవడం సరైందికాదన్నారు.

**PTC రాజన్న**

-------------------------